నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 19 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

## కుట్టుమిషన్ల పంపిణీకి జాప్యమెందుకు?

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



రేగా కాంతారావు

మణుగూరు టౌన్, డిసెంబర్ 18 : ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరుపేద ముస్లిం మైనార్టీలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశామని, వాటిలో మిగిలిన కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మగ్గిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే మైనార్టీలకు కుట్టుమిషన్లు అందజేయాలని, లేదంటే అన్ని ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# సీసీఐ కేంద్రం.. తూతూమంత్రం



- ప్రైవేట్‌లోనే అత్యధిక మంది రైతుల విక్రయాలు
- సీసీఐ కంటే వ్యాపారుల వద్దే మెజార్టీ అమ్మకాలు
- దళారుల అడ్డాగా భారత పత్తి సంస్థ కేంద్రాలు
- అసలు రైతులు పంటను తీసుకొస్తే కొర్రీలు
- విధిలేక ఊళ్లలోనే అమ్ముకుంటున్న రైతులు



ఖమ్మం ఏఎంసీకి రైతులు తీసుకొచ్చిన పత్తి పంట(ఫైల్)

| | |
|---|---|
| ప్రైవేట్‌లో పత్తి కొనుగోళ్లు | 3,81,730 క్వింటాళ్లు |
| సీసీఐ పత్తి కొనుగోళ్లు | 2,64,251 క్వింటాళ్లు |
| సీసీఐ మద్దతు ధర (క్వింటాకు) | రూ.7,520 |
| ప్రైవేట్‌లో అత్యధిక ధర (ఏఎంసీలో) | రూ.7,200 |

ఖమ్మం, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో భారత పత్తి సంస్థ( సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోళ్లు మాత్రం తూతూమంత్రంగానే జరిగాయి. ప్రైవేట్ మార్కెట్లో రైతులకు మద్దతు ధర లభించడం లేదని ప్రభుత్వమే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతులు ప్రైవేటులోనే అధిక మొత్తంలో పంటను విక్రయిస్తున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. దీంతో 'నామ్‌కే వాస్తే'గానే సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగినట్లు అర్థమవుతోంది.

ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఈ సంవత్సరం సుమారుగా 2.30 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. వరుసగా వర్షాలు, వరదలు రావడం; చీడపీడలు ఆశించడం వంటి కారణాలతో దిగుబడులు పెద్దగా రాలేదు. సాధారణంగా పత్తిలో ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంటుంది. కానీ.. ఈ ఏడాది 5-6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. మొదటి దఫా పత్తితీత తరువాత తిరిగి మొగ్గలు రాకపోవడంతో పత్తి పంట స్థానంలో ఆయా మండలాల రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు.

### ప్రైవేటులోనే అధిక విక్రయాలు..

ఇక ఈ ఏడాది జిల్లాలోని ఆయా వ్యవసాయ మార్కెట్లలో ప్రైవేట్ పత్తి ఖరీదుదారులు 3,81,730 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. భారత పత్తి సంస్థ ఏర్పాటు చేసిన తొమ్మిది సీసీఐ కేంద్రాల్లో కలిపి ఇప్పటివరకు 2,64,251 క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు చేశారు. అంటే ప్రైవేట్ వ్యాపారులు సీసీఐ కంటే దాదాపుగా 1.20 లక్షల క్వింటాళ్ల పత్తిని అదనంగా కొన్నారు. సీసీఐ మద్దతు ధరకంటే క్వింటాకు రూ.500-రూ.1,000 వరకు తక్కువ ధర పలికినప్పటికీ రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకునేందుకు మొగ్గు చూపారు. భారత పత్తి సంస్థ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ సీజన్ ఆరంభంలో ఆశించిన మేర కొనుగోళ్లు జరపలేదు. దీంతో బీఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఖమ్మం ఏఎంసీలో పర్యటించారు. పత్తి రైతుల పాట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో కొనుగోళ్ల ప్రక్రియను సీసీఐ వేగవంతం చేసింది. ఇక దళారులు కూడా గ్రామాల్లో రైతుల వద్ద కొనుగోలు చేసిన పంటను నేరుగా సీసీఐ కేంద్రాలకు తరలించి రైతుల పంటగా చూపి సొమ్ము చేసుకున్నారు.

### ఏఎంసీల్లో కొనుగోళ్లు ఇలా..

జిల్లా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఖమ్మం, మధిర, కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ల పరిధిలో ప్రైవేట్ వ్యాపారులు పంట కొనుగోలు చేశారు. నేటి వరకూ ఏఎంసీలవారీగా పరిశీలిస్తే.. ఖమ్మంలో 1,70,390 క్వింటాళ్లు, మధిరలో 20,322 క్వింటాళ్లు, కల్లూరులో 932 క్వింటాళ్లు, వైరాలో 18,047 క్వింటాళ్లు, ఏన్కూరులో 1,70,669 క్వింటాళ్లు, సత్తుపల్లిలో 100 క్వింటాళ్లు, మద్దులపల్లిలో 1,270 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేశారు. దీంతో మొత్తంగా ఈ ఏడాది ప్రైవేట్ వ్యాపారులు 3,81,730 క్వింటాళ్ల పంటను కొనుగోలు చేసినట్లయింది. అయితే, ప్రైవేట్‌లో ఈ సంవత్సరం అత్యధికంగా క్వింటాకు రూ.7,200 ధర పలుకగా.. అత్యల్పంగా క్వింటాకు రూ.6,300 ధర పలికింది.

### సీసీఐ కొనుగోళ్లు ఇలా..

పత్తి పంటను కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు ఖమ్మం జిల్లావ్యాప్తంగా తొమ్మిది జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖమ్మం, మద్దులపల్లి ఏఎంసీలో రెండు చొప్పున, మధిర ఏఎంసీ పరిధిలో మూడు చొప్పున, నేలకొండపల్లి, వైరాల్లో ఒక్కోటి చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలవారీగా పరిశీలిస్తే జీఆర్ఆర్ గుర్రాలపాడు కేంద్రంలో 25,197 క్వింటాళ్లు, శ్రీబాలాజీ జిన్నింగ్ మిల్లు కేంద్రంలో 19,201 క్వింటాళ్లు, అమరావతి జిన్నింగ్ మిల్లు కేంద్రంలో 28,888 క్వింటాళ్లు, మంజిత్ జిన్నింగ్ మిల్లు కేంద్రంలో 26,239 క్వింటాళ్లు, శ్రీశివ గణేశ్ జిన్నింగ్ మిల్లు కేంద్రంలో 37,268 క్వింటాళ్లు, ఉషా జిన్నింగ్ మిల్లు కేంద్రంలో 43,403 క్వింటాళ్లు, ఎంఎస్ స్టప్లిచ్ కేంద్రంలో 25,123 క్వింటాళ్లు, పొన్నెకల్ జీఆర్ఆర్ కేంద్రంలో 54,453 క్వింటాళ్లు, భాగ్యలక్ష్మి కేంద్రంలో 33,010 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు సీసీఐ ద్వారా 2,64,425 క్వింటాళ్ల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి.

## మండల పరిషత్ ఎదుట మల్టీపర్పస్ వర్కర్ల ధర్నా

### తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



బోనకల్లు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

బోనకల్లు, డిసెంబర్ 18 : మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లు ఖమ్మం జిల్లా బోనకల్లు మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు మరీదు పుల్లయ్య మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన వ్యక్తం చేసేందుకు హైదరాబాద్ వెళ్తుంటే పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో రురావత్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంథోటి రమేశ్, బోయిన సుధాకర్, పీ.శ్రీనివాసరావు, ఆర్.వెంకటేశ్వరరావు, బీ.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల హాస్టల్ వద్ద పోలీస్ బందోబస్తు

### తల్లిదండ్రులను, విద్యార్థి సంఘాలను లోపలికి అనుమతించని పోలీసులు



దానవాయిగూడెంలోని బీసీ హాస్టల్ ప్రధాన గేటు వద్ద మోహరించిన పోలీసులు

రఘునాథపాలెం, డిసెంబర్ 18 : ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం దానవాయిగూడెంలోని బీసీ బాలికల గురుకుల హాస్టల్‌లో గత నెలలో పదో తరగతి విద్యార్థినిని ఎలుకలు కొరకగా చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హాస్టల్ ప్రాంగణంలోకి ఎవరినీ అనుమతించకుండా ప్రధాన గేటు వద్ద బుధవారం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు పలు పనుల నిమిత్తం వచ్చిన వారిని లోనికి అనుమతించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ కుమార్తె అనారోగ్యంతో ఉందని, కలిసి వెళ్లేందుకు వచ్చామని పలువురు వేడుకున్నా ఈరోజు పేరెంట్స్‌కు అనుమతి లేదంటూ పోలీసులు తేల్చిచెప్పారు. అయినా తల్లిదండ్రులు గంటలకొద్దీ గేటు వద్దనే వేచి చూశారు. దూరాభారం నుంచి ఎన్నో ఆశలతో హాస్టల్‌లో తమ పిల్లలను కలిసేందుకు వచ్చిన పేరెంట్స్ పోలీసుల చర్యలతో నిరుత్సాహంతో వెనుదిరిగారు. అంతేకాక బీసీ బాలికల హాస్టల్‌లో బాలికపై ఎలుకల దాడి ఘటన జరిగిన విషయం తెలుసుకునేందుకు వచ్చిన పలు విద్యార్థి సంఘాలను సైతం లోనికి అనుమతించలేదు. అయితే హాస్టల్‌లో విచారణ జరుగుతున్నదని, అనుమతి లేదంటూ సీఐ ఉస్మాన్ షరీఫ్ అక్కడకు వచ్చిన పేరెంట్స్‌తోపాటు విద్యార్థి సంఘాలకు తేల్చిచెప్పారు.



ఆటో కార్మికులకు మద్దతుగా హైదరాబాద్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పక్కన ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

## ఎలుకల దాడి ఘటనపై జడ్జి విచారణ

### గురుకుల ప్రిన్సిపాల్, విద్యార్థినులను కలిసి వివరాల సేకరణ



ఖమ్మంలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న జడ్జి

రఘునాథపాలెం, డిసెంబర్ 18 : ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం దానవాయిగూడెం బీసీ బాలికల గురుకుల హాస్టల్‌లో 10వ తరగతి విద్యార్థిని లక్ష్మీభవాని కీర్తిపై జరిగిన ఎలుకల దాడి ఘటనపై జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ చంద్రశేఖర్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. హాస్టల్‌ను సందర్శించిన ఆయన సుమారు రెండు గంటలపాటు పూర్తి స్థాయిలో విచారణ చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు విద్యార్థినులను స్వయంగా కలిసి వివరాలు తెలుసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఖమ్మం మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థిని లక్ష్మీభవాని కీర్తిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

## అర్థమయ్యే రీతిలో బోధించాలి

### ఐటీడీఏ పీవో రాహుల్

పాల్వంచ రూరల్, డిసెంబర్ 18 : ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. నాగారం తండా, తోగ్గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉద్దీపకం పుస్తకాల్లోని పాఠ్యాంశాల గురించి విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన విద్యార్థులు ఇంగ్లిష్, గణితం చదవడం, రాయడంలో వెనుకబడిపోతున్నారని, వారికి చిత్రాలతో సహా తేలికగా అర్థమయ్యే విధంగా దీనిని రూపొందించామన్నారు. ఈ సందర్భంగా పీవో అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థులు సరైన జవాబులు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్, ఉపాధ్యాయులు భద్రు, హరిలాల్, సుజాత, పద్మ, రాంబాబు, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

## బతుకమ్మలతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

### కలెక్టరేట్ వద్ద తొమ్మిదో రోజుకు చేరిన సమ్మె



భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట బతుకమ్మలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 18 : ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట బతుకమ్మలతో నిరసన తెలిపారు. అనంతరం పలువురు మహిళా నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పని చేస్తున్న తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, పే స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందిన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం ఎంఈవో కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ హైమావతి, మెసెంజర్ యాకయ్యల చిత్రపటాలకు ఆందోళనలో భాగంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా నాయకులు తులసి, కవిత, సుశీల, పార్వతి, వనమా సురేశ్, సిద్ధయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ ఎదుట విద్యార్థినుల ఆందోళన

### టీచర్లు రావాలని, చదువు చెప్పాలని డిమాండ్



చంద్రుగొండ కేజీబీవీలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 18 : వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడంతో మాకు ప్రతి రోజూ పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు రావాలని డిమాండ్ చేస్తూ చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ విద్యార్థినులు ప్లకార్డులతో బుధవారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ సీఆర్టీల సమ్మెతో కేజీబీవీల్లో విద్యాబోధన నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా హాస్టల్‌లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు ఉన్నా.. ఉపాధ్యాయుల సమ్మెతో తమకు చదువు చెప్పేవారు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. మా టీచర్ల సమస్యలు పరిష్కరించి, మాకు చదువు చెప్పే విధంగా సీఎం సారు చూడాలని విద్యార్థినులు కోరారు. కాగా.. చంద్రుగొండ కేజీబీవీ వసతి గృహాన్ని సందర్శించిన డీఈవో వెంకటేశ్వరాచారి వంటలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తనకు చెప్పాలని, కొద్ది రోజుల్లో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని చెప్పారు. హాస్టల్ విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో సత్యనారాయణ ఉన్నారు.



అన్నపురెడ్డిపల్లి కేజీబీవీలో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

# పంచాయతీకి సర్వం సిద్ధం

- 479 గ్రామ పంచాయతీల్లో 4,264 పోలింగ్ కేంద్రాలు
- 6,33,947 మంది పల్లె ఓటర్లుగా లెక్క తేల్చిన అధికారులు
- ఎటూ తేలని భద్రాచలం, సారపాక జీపీ ఎన్నికలు



పంచాయతీ ఎన్నికలు జరగని సారపాక పంచాయతీ కార్యాలయం

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజుల నుంచి ఓటర్ల జాబితాతోపాటు కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, పోలింగ్ కేంద్రాల సంఖ్యను సైతం వార్డులవారీగా సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా 479 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు.. 4,264 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. వాటిలో మౌలిక సౌకర్యాలు ఉన్నాయా.. లేదా.. అని డీపీవో చంద్రమౌళి పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 6,33,947 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. జిల్లాలోని 22 మండలాల్లో ఉన్న గ్రామపంచాయతీలను మాత్రమే గుర్తించారు. ఇందులో భద్రాచలం, సారపాక పంచాయతీ ఓటర్ల జాబితాను నమోదు చేయలేదు.


### 6,33,947 మంది పల్లె ఓటర్లు

గత అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల ప్రకారం రూపొందించిన జాబితా ఆధారంగా పంచాయతీ ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో కొత్తగా నమోదైన ఓటర్లలో పురుషులు 3,08,492 మంది, మహిళలు 3,25,431 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. మొత్తం పల్లె ఓటర్లు 6,33,947 మంది ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. వార్డులవారీగా పోలింగ్ కేంద్రాలను కూడా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, ఇతర కార్యాలయాల్లో కేటాయించి నెంబర్లు వేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో డీపీవో చంద్రమౌళి పరిశీలించారు.

### ఎటూ తేలని భద్రాచలం, సారపాక జీపీలు

గత కేసీఆర్ ప్రభుత్వంలో సారపాక, భద్రాచలం పంచాయతీల్లో కొత్తగా ఐదు పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 22 మండలాలతోపాటు భద్రాచలం మండలంలో ఉన్న భద్రాచలంను మూడు పంచాయతీలుగా చేయడంతోపాటు సారపాక పంచాయతీని రెండు పంచాయతీలుగా చేశారు. అయితే కాంగ్రెస్ సర్కారు.. ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంలో ఆ ఐదు పంచాయతీలను లెక్కలోకి తీసుకోలేదు. దీంతో ఆ ప్రాంతవాసుల ఆశలు అడియాలయ్యాయి. భద్రాచలాన్ని మండల పరిషత్ చేసినప్పుడు.. పంచాయతీ ఎన్నికలు జరపడానికి అభ్యంతరం ఏమిటో చెప్పకపోవడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు మాత్రం ఎన్నికల నోటిఫికేషన్ నాటికి వాటిని కూడా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు.

### 479 పోలింగ్ కేంద్రాలను గుర్తించాం..



22 మండలాల్లోని 479 పంచాయతీల్లో 4,232 పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. భద్రాచలం, సారపాక పంచాయతీల వివరాలు ఇంకా రాలేదు. నోటిఫికేషన్ వస్తే కానీ పూర్తి సమాచారం తెలియదు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాతోపాటు పోలింగ్ కేంద్రాలను గుర్తించాం.

–చంద్రమౌళి, డీపీవో